క్లుప్తంగా

మాచన రఘునందన్‌కు అభినందన

రామగిరి(నల్లగొండ): పొగాకు నియంత్రణకై గత 22 ఏళ్లుగా పోరాటం చేస్తున్న పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ చండీగఢ్‌కు చెందిన ప్రజారోగ్య, అధ్యయన పరిశోధన సంస్థ స్ట్రాటజిక్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పబ్లిక్‌హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (సైఫర్) జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం చండీగఢ్‌లో అవార్డు సెలక్షన్ కమిటీ నిర్వహించిన ఇంటర్వ్యూకు రఘునందన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయనను చండీగఢ్‌కు చెందిన ప్రజారోగ్య నిపుణుడు సోనూగోయల్ అభినందించారు. పొగాకు నియంత్రణకు మాచన రఘునందన్ చేస్తున్న కృషిని ఆయన కొనియాడారు. పొగాకు నియంత్రణ సదస్సులకు హాజరుకావాల్సిందిగా రఘునందన్‌ను కోరారు.

సినీ కార్మికులకు వేతనాలను పెంచాలి

చిట్యాల : సినీ కార్మికులకు వేతనాలను పెంచడంతో పాటు రోజువారిగా చెల్లించాలని సెంట్రల్ సెన్సార్ బోర్డు మాజీ సభ్యుడు వనమా వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వేలాది కోట్ల రూపాయలతో చిత్రాలను నిర్మిస్తున్న నిర్మాతలు సినిమా నిర్మాణంలో అన్ని విభాగాల్లో కీలకంగా పనిచేస్తున్న కార్మికులకు తగిన న్యాయమైన వేతనాలు ఇవ్వడంతో నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. వెంటనే కార్మికులకు డిమాండ్‌ల మెరకు వేతనాలను చెల్లించి కార్మికుల సమ్మెను విరమింపజేయాలని ఆయన కోరారు.

యువజన సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక


వల్లమల్ల సైదులు, అధ్యక్షుడు

శాలిగౌరారం : మండలంలోని బాలిశెట్టిగూడెంకు చెందిన జనచైతన్య యువజన సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా వల్లమల్ల సైదులు, ఉపాధ్యక్షుడు కల్లూరు మల్లయ్య, కార్యదర్శి కుంభం సైదులు, సహాయ కార్యదర్శి గండమల్ల రాజు, పలువురు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నిధులు మంజూరు చేయాలని ఎంపీకి వినతి


ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నకిరేకల్ : స్థానిక గీత కార్మిక సహకార సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మున్సిపాలిటీ చైర్ పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్, ఆసంఘం అధ్యక్షుడు కొండ వెంకన్న గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రంఅందజేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆసంఘ నాయకులు చౌగోని వెంకన్న, మల్లే బోయిన దశర థ, చౌగోని నాగయ్య, తదితరులు ఉన్నారు.

నెర్మట, షేరిగూడెంకు బీటీ రోడ్డు నిర్మించాలి

చండూరు : నెర్మట నుండి షేరిగూడెం వరకు బీటీ రోడ్డు వేయాలని సీపీఎం మండల కార్యదర్శి ధనుంజయ డిమాండ్ చేశారు. ఇంటింటికి సీపీఎం కార్యక్రమంలో భాగంగా ఆదివారం నెర్మట నుంచి షేరిగూడం రోడ్డు గుంతలమయం అయిందని గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. త్వరగా నిధులు మజూరు చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈరటి వెంకటస్వామి, స్వామి, బొమ్మరగోని యాదయ్య, నరసింహ, గ్రామప్రజలు సాయిలు, వెంకన్న, నర్సింహ్మ, రమేష్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పంచ జ్యోతిర్లింగాలకు 16న టూరిస్ట్ ట్రైన్

రామన్నపేట: పంచ జ్యోతిర్లింగ దర్శనయాత్ర నిమిత్తం ఈనెల 16న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరే భారత్ గౌరవ్ స్పెషల్ టూరిస్ట్ ట్రైన్‌ను సద్వినియోగం చేసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే ఐఆర్‌సీటీసీ అసిస్టెంట్ మేనేజర్ పీవీ వెంకటేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీమశంకర్, గ్రిషనేశ్వర్‌ల దర్శనంకోసం రైల్వే శాఖ ట్రైన్ ఏర్పాటు చేసిందన్నారు. స్లీపర్ కోచ్ ఒకరికి రూ.14,700, త్రీ ఏసీ రూ.22,900 చొప్పున చార్జీలు చెల్లించాలని, భక్తులకు భోజన సౌకర్యం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9701360701, 9281030711 నంబర్లను సంప్రదించాలని రైల్వే ఐఆర్‌సీటీసీ అసిస్టెంట్ మేనేజర్ తెలిపారు.

చిత్రాలు చెప్పే పాఠాలు..



చిట్యాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల


పాఠశాల గోడలపై వివిధ రకాల చిత్రాలు


చెట్ల నరికివేతతో కలిగే అనర్థాలను తెలిపే చిత్రం



మానవుడి ఊపిరితిత్తులు, గుండె చిత్రాలు

- దాతల సహకారంతో పాఠశాలను అందంగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులు
- తరగతి గదుల గోడలపై విజ్ఞానాన్ని పెంపొందించేలా చిత్రాలు
- ఆహ్లాదకరంగా మారిన చిట్యాల ప్రాథమిక పాఠశాల

చిట్యాల: ఈ విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు చిట్యాల పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తరగతి గదులు, గోడలు కళావిహీనంగా మసకబారి ఉండేవి. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంబటి సత్తయ్యతోపాటు ఇతర ఉపాధ్యాయుల కృషి, దాతల సహకారంతో ప్రస్తుతం ఆ పాఠశాల తరగతి గదుల గోడలు రంగురంగుల విజ్ఞాన తెరల్లా విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధిస్తూ ఆకట్టుకుంటున్నాయి.

పాఠ్యాంశాలతో కూడిన బొమ్మలు..

చిట్యాల పట్టణంలోని మండల పరిషత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సుమారు నూటా నలభై మందికి పైగా విద్యార్థులు, తొమ్మిది మంది ఉపాధ్యాయులు ఉన్నారు. అయితే గత సంవత్సరం వరకు పాఠశాల గోడలు వెలసిపోయి కనిపించేవి. దీంతో ఉపాధ్యాయులు పాఠశాలను ఎలాగైనా అందంగా తీర్చిదిద్దాలని భావించారు. దాతల సహకారం తీసుకుని పాఠశాలను అభివృద్ధి చేయాలనుకున్నారు. ఈ పాఠశాలకు చిట్యాల పట్టణానికి చెందిన రైస్ మిల్లర్స్ అధ్యక్షుడు తేరటుపల్లి హన్మంతు రూ.67,000 ఆర్థిక సహకారం అందించడంతో పాఠశాల మొత్తానికి ఆకర్షణీయమైన రంగులతో పెయింటింగ్ వేయించారు. అనంతరం మరికొందరు దాతలు సమకూర్చిన రూ.26500లతో పాటు ఉపాధ్యాయులు సొంతంగా రూ.43,500 ఖర్చుచేసి తరగతి గదుల గోడలపై పాఠ్యాంశాలతో కూడిన బొమ్మలను వేయించారు.

విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా..

పాఠ్యాంశాలకు సంబంధించిన శాస్త్రీయ, భౌగోళిక, భాషా సంబంధించిన ఆకర్షణీయమైన చిత్రాలను గీయించడం ద్వారా పాఠశాల వాతావరణాన్ని ఆహ్లాదకరంగా మార్చడంతోపాటు విద్యార్థులకు ఆసక్తి కలిగించేలా చేశారు. గోడలపై గణితం, భౌగోళిక అంశాలు, జీవశాస్త్ర, అంకెలు, గుణింతాలు, తెలుగు భాష అంశాలతో కూడిన బొమ్మలను వేయించారు. రోజు వీటిని చూడడం ద్వారా విద్యార్థులకు ఆయా అంశాల్లో విజ్ఞానాన్ని పెంపొందించేలా తరగతి గదులు తయారయ్యాయి. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచుకోవడంతోపాటు విద్యార్థులకు అవసరమైన చిత్రాలు గీయించడంతో ఆ పాఠశాల ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందిస్తున్నారు.

పాఠ్యాంశాలను పెయింటింగ్ వేయించాం



చిట్యాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గతంలో వంద మందికి పైగా ఉన్న విద్యార్థుల తోపాటు ఈ విద్యా సంవత్సరంలో 38 మంది నూతన విద్యార్థులకు అడ్మిషన్‌లు ఇచ్చాం. విద్యార్థులను ఆకట్టుకునేందుకు మా తోటి ఉపాధ్యాయులు, దాతల సహకారంతో పాఠశాల వాతావరణాన్ని ఆకర్షణీయంగా మార్చాలనుకున్నాం. పలువురు దాతలతోపాటు మాతోటి ఉపాధ్యాయులు ఆర్థిక తోడ్పాటు అందించడంతో పాఠశాల గోడలపై పాఠ్యాంశాలను పెయింటింగ్ వేయించాం. విద్యార్థులు ప్రతిరోజు గోడలపై చిత్రాలను చూస్తూనే పలు అంశాలను నేర్చుకుంటున్నారు.

– అంబటి సత్తయ్య, ప్రధానోపాధ్యాయుడు, చిట్యాల

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

మునుగోడు : నూతనంగా భూమి పట్టా పాస్‌పుస్తకం పొందినా రైతులు ప్రభుత్వం అందించే రైతు బీమాకు దరఖాస్తు చేసుకొవాలని మండల వ్యవసాయ అధికారి పద్మజ ఒక ప్రకటనలో కోరారు. బీమాకు దరఖాస్తుచేసే రైతు దరఖాస్తు ఫారంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్‌లని జతచేసి క్లస్టర్ ఏఈఓలకు అందజేయాలని కోరారు.

తిప్పర్తి : జూన్ 5 వరకు కొత్తగా పాస్ బుక్ వచ్చిన రైతులందరూ రైతు బీమా కోసం ఈ నెల 13 వరకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 18ఏళ్ల నుంచి 59ఏళ్ల వరకు వయసు ఉన్న రైతులందరూ దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డ్ జిరాక్స్‌లతో పూర్తి చేసిన దరఖాస్తులను వ్యవసాయ విస్తరణ అధికారులకు ఈనెల 13వ తేదీ వరకు అందజేయాలన్నారు.

కేతేపల్లి : కొత్తగా పట్టాదారు పాసు పుస్తకం పొందిన రైతులు రైతుబీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కేతేపల్లి ఏఓ బి.పురుషోత్తం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 59 ఏళ్ల లోపు వయస్సు కలిగి ఉండి, 2025 జూన్ 5వ తేదీ వరకు కొత్తగా పాసు పుస్తకాలు తీసుకున్న రైతులు మాత్రమే ఈ పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. రైతు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్, నామిని పత్రాలతో ఈనెల 13లోగా ఏఈఓలకు అందజేయాలని సూచించారు.

విద్యార్థుల హాజరు శాతం పెంచాలి

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా సహకార అధికారి పత్యానాయక్ అన్నారు. ఆదివారం దామరచర్ల మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలికల పాఠశాల, గిరిజన సంక్షేమ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, స్టోర్ రూమ్, వంట గదులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేందుకు వార్డెన్లు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.


పాఠశాలలో వంటగదిని పరిశీలిస్తున్న జిల్లా సహకార అధికారి పత్యానాయక్

ఆది పరాశక్తి దేవిగా రేణుక ఎల్లమ్మ


ఆది పరాశక్తి అలంకరణలో అమ్మవారు

కనగల్ : మండలంలోని దర్వేశిపురం రేణుక ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని అర్చకులు ఆదివారం ఆది పరాశక్తి దేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పసుపు, కుంకుమలతో అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

వెలవెలబోతున్న ఆర్టీసీ బస్టాండ్



బస్సులు రాకపోవడంతో వెలవెలబోతున్న ఆర్టీసీ బస్టాండ్

నకిరేకల్ : ఇటీవల అన్ని హంగులు, సదుపాయాలతో పునరుద్ధరించిన నకిరేకల్ ఆర్టీసీ బస్టాండ్‌లోకి పూర్తి స్థాయిలో బస్సులు రావడం లేదు. నామమాత్రంగా బస్సు సర్వీసులు వచ్చి వెళ్తున్నాయి. ఎలక్ట్రిక్ బస్సు సర్వీస్‌లు కూడా రావడం లేదు. ప్రతి రోజు నకిరేకల్ మీదుగా సూర్యాపేట, నల్లగొండ, కోదాడ, ఖమ్మం, మధిర, ఇల్లందు, కొత్తగూడెం, భద్రాచలం, విజయవాడ డిపోల నుంచి బస్ సర్వీస్‌లు రాకపోకలు సాగిస్తుంటాయి. వీటిలో కొన్ని సర్వీస్‌లు మాత్రమే నామమాత్రంగా వచ్చి వెళ్తున్నాయి. దీంతో ప్రయాణికుల మళ్లీ మెయిన్ సెంటర్ వెళ్లి బస్ ఎక్కాల్సిన పరిస్థితి వచ్చిందని ప్రయాణికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో బస్ సర్వీస్ అన్ని వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేత

కనగల్ : మండల పరిధిలోని రేగట్టే ప్రాథమిక పాఠశాలలో ఆదివారం వేముల చంద్రమౌళి స్మారకార్థం ఆయన సతీమణి మంగతాయమ్మ విద్యార్థిని, విద్యార్థులకు టై, బెల్టులు, నోట్ బుక్స్ అందజేసి మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ ఖాన్, మంగతాయమ్మ కొడుకు వేముల ప్రకాష్, కూతురు గీతాంజలి, గిరిజ అమ్మ ఆదర్శ ఫౌండేషన్ చైర్మన్ ఎర్రోళ్ల సురేష్, దొమ్మాటి శ్రీను, భోగరాజు సైదులు, జానీ, భిక్షపతి, వేముల వెంకన్న, భీమనపల్లి వెంకన్న, పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి


మాట్లాడుతున్న సలీం

నల్లగొండ టౌన్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం అన్నారు. ఆయన ఆదివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన సీపీఎం సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించకుండా భావోద్వేగాలని రెచ్చగొడుతూ విధ్వంసపాలన కొనసాగిస్తుందన్నారు. ఇంటి స్థలం లేని నిరుపేదలకు ప్రభుత్వమే భూమిని కొనుగోలు చేసి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలో అర్హులైన వారందరికీ ఆసరా పెన్షన్ మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం మున్సిపాలిటీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో ప్రజా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఈ సమావేశంలో తుమ్మల పద్మ, కుంబం కృష్ణారెడ్డి, సర్దార్ అలీ, కుంభం లక్ష్మమ్మ, సల్లోజు విష్ణుమూర్తి, కత్తుల ముత్తయ్య, సాకే వెంకటేశ్వర్లు, కుమ్మరి వెంకన్న, గనిపెల్లి రాములు, కల్లట్ల వెంకన్న, సల్లాజ విష్ణుమూర్తి, వనజ, ధనమ్మ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలి


చిట్యాల : ధర్నాలో మాట్లాడుతున్న జిట్ట నగేష్


నకిరేకల్ : నిరసన తెలుపుతున్న నాయకులు

చిట్యాల : బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్రపతి ఆమోదించి, రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్ చేర్చాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్యలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ చిట్యాలలో ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను నలభై రెండు శాతానికి పెంచాలని అసెంబ్లీలో తీర్మానం చేసి రాష్ట్రపతి ఆమోదానికి పంపినప్పటికీ కేంద్ర ప్రభుత్వం తగిన రీతిలో స్పందించడం లేదన్నారు. వెంటనే బీసీ రిజర్వేషన్‌లు పెంచకపోతే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తీరని అన్యాయం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బొబ్బలి సుధాకర్‌రెడ్డి, మెట్టు పరమేష్, ఐతరాజు యాదయ్య, గుడిసె లక్ష్మీనారాయణ, అక్కెనపల్లి నాగయ్య, పాలమాకుల అర్జున్, మేడి సుగుణమ్మ, జిట్ట స్వామి, చంద్రమౌళి, లింగయ్య, పోతులూరి పాల్గొన్నారు.

నకిరేకల్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అములు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో నకిరేకల్‌లో ఆదివారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందాల ప్రమీలా, రాచకోండ వెంకన్న గౌడ్, వంటిపాక వేంకటేశ్వర్లు, గుడుగుంట్ల బుచ్చిరాములు, యానాల క్రిష్టారెడ్డి, వంటిపాక క్రిష్ణ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు


కొత్తపేటలో బోనాలను తీసుకెళ్తున్న మహిళలు


రామగిరి(నల్లగొండ) : రామగిరి ముత్యాలమ్మ దేవాలయంలో..

రామగిరి(నల్లగొండ): శ్రావణమాసం మూడో ఆదివారం సందర్భంగా రామగిరి లోని ముత్యాలమ్మ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు బోనాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఈనెల 23న ఆలయంలో అన్నదానం, 25న రథోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు ఎలిజాల అంజయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, పవన్, దీపక్, శివ, మణికుమార్, చంద్రకళ, శ్రీలత, వెంకటస్వామి, సుమతమ్మ, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

అంతయ్యగూడంలో..

తిప్పర్తి : తెలంగాణ సాంప్రదాయ పండుగ బోనాల వేడుకలను మండలంలోని అంతయ్యగూడం గ్రామంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయం వద్దకు డప్పు చప్పుళ్లతో ర్యాలీగా బయలు దేరి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం మొక్కులు చెల్లించారు.


తిప్పర్తి : అంతయ్యగూడెంలో..


నకిరేకల్ : అమ్మవారికి ఒడిబియ్యం పోస్తున్న మహిళలు

నకిరేకల్ : పట్టణంలోని శ్రీ కాళికామాత దేవాలయంలో ఆదివారం శ్రావణ మాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం పోశారు. ఈ వేడుకల్లో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు బ్రహ్మదేవర రవిశంకర్ గాయిత్రి, ప్రతినిధులు రవి చందర్‌మాదవి, బ్రహ్మదేవర రామకృష్ణ శ్రీదేవి, రామ్ ప్రసద్ సరితా, రవీందర్ శ్రీలక్ష్మీ, రాజేశఖర్, పాల్గొన్నారు.

తేపల్లి : మండలంలోని కొత్తపేట, చీకటిగూడెం తదితర గ్రామాల్లో ఆదివారం బోనాలపండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లతో మహిళలు బోనాలతో ప్రదర్శనగా ఆలయం వద్దకు చేరుకున్నారు. ఎడ్ల బండ్లను అదంగా అలంకరించి గ్రామాలలో ప్రదర్శన నిర్వహించారు.

బడికి రంగులు వేయరూ..


రంగులు వేయని మునుగోడు జెడ్పీహెచ్‌ఎస్ అదనపు తరగతి గదులు

మునుగోడు : ప్రవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు అని సౌకర్యాలతో కూడిన వసతి కల్పించాలని ప్రభుత్వం అధికారులకు సూచిస్తుంది. కాని నియోజకవర్గ కేంద్రమైన మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో అందుకు విరుద్ధంగా ఉంది. 40ఏళ్ల క్రితం నిర్మించిన తరగతి గదులు పూర్తిగా శిథిలం కావడంతో 2021లో డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.68లక్షలతో 8తరగతి గదులను నిర్మించారు. కానీ నేటికి ఆ తరగతి గదులకు రంగులు వేయలేదు. అంతే కాకుండా ఆ గదుల్లో విద్యుత్ సౌకర్యం కూడ ఏర్పాటు చేయలేదు. ఇప్పటికైన స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి అదనపు తరగతి గదులకు రంగులు వేయడంతో పాటు విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వెలగని హైమాస్ట్ లైట్లు


నార్కట్‌పల్లికి వచ్చే బైపాస్ వద్ద వెలగని లైట్లు

నార్కట్‌పల్లి : మండలంలోని జాతీయ రహదారిపై పలు చోట్ల ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. మండల పరిధిలోని గోపాలయపల్లి ఆర్చీ, నార్కట్ పల్లి గ్రామానికి వెళ్లే కూడాలి వద్ద హైమాస్ట్ లైట్లను జీఎంఆర్ సంస్థ ఏ ర్పాటు చేసింది. ప్రస్తుతం లైట్లు వెలగకపోవడంతో రాత్రి సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు స్పందించి లైట్లు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

సైదులు కుటుంబానికి ఆర్థికసాయం


సైదులు కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కట్టంగూర్ : మండలంలోని మునుకుంట్ల గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు పసుల సైదులు గతేడాది రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. సైదులు ప్రథమ వర్ధంతి సందర్భంగా మండలంలోని బీజేపీ నాయకులు మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ తరఫున సైదులు భార్య విజయకు రూ.40వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నీలంనాగరాజు, పబ్బువెంకటేశ్వర్లు, పాదూరివెంకట్‌రెడ్డి, చిరంజీవి, పులకరం నాగరాజు, యాదయ్య, మల్లిఖార్జున్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.